




# గ్రామాల్లో వన మహోత్సవం

మండలంలోని పలు గ్రామాల్లో వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు, గ్రామస్తులు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. గ్రామాల్లో విస్తృతంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

- శెనార్తి మీడియా, శంకరపట్నం

# బీఆర్ఎస్ పై అసత్య ఆరోపణలు మానుకోవాలి

**బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు**



**శెనార్తిమీడియా, గంగాధర :**

కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ నాయకులపై అసత్య ఆరోపణలు మానుకోవాలని బీఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్ రావు అన్నారు. గంగాధర మండలం మధురానగర్ లో మంగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణపూర్ రిజర్వాయర్ కుడి కాలువ పనులను బీఆర్ఎస్ పార్టీ అడ్డుకుంటుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించడాన్ని ఖండించారు. కుడి కాలువ పనులు ఎక్కడ మొదలు పెట్టారు, అడ్డుకున్న సన్నాసులు ఎవరు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. నారాయణపూర్ కుడికాలువ పనులు 98% బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేశామని, ఒక బాక్స్ కల్వర్టు మిగిలిపోయాయన్నారు. మిగతా రెండు శాతం పనులు పూర్తిచేస్తే మధురానగర్, వెంకంపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి గ్రామాలతో పాటు బోయినపల్లి మండలంలోని నాలుగు గ్రామాలకు పూర్తిస్థాయిలో కుడికాలువ ద్వారా నీళ్లు ఇచ్చుకునే అవకాశం ఉందన్నారు. మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం తట్టెడు మట్టిని తీయలేదని విమర్శించారు. కార్యక్రమంలో గంగాధర, బోయినపల్లి మండలాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# అలరించిన 'డ్రీమ్స్' ఫ్రెషర్స్ పార్టీ

**శెనార్తిమీడియా, కరీంనగర్ :**

కొత్తపల్లి మండలం రేకుర్తి డ్రీమ్ డిఫెన్స్ అకాడమీ, జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో ఘనంగా డ్రీమ్ నెక్సస్ 2026 పేరిట నిర్వహించిన ఫ్రెషర్స్ పార్టీ అందరినీ అలరించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్సారార్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, విద్యార్థులకు సూచనలు, ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా సెకండియర్ స్టూడెంట్స్ ఫస్టియర్ స్టూడెంట్స్ ను ఆత్మీయంగా స్వాగతించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ కరస్పాండెంట్ వెంకట్ రెడ్డి, లెక్చరర్స్ పాల్గొన్నారు.



## తహసీల్ కార్యాలయానికి కుటుంబ కలహాలు

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** భూ వివాదం పరిష్కారం కోసం తహసీల్ కార్యాలయానికి వచ్చిన కుటుంబ సభ్యులు అక్కడే గొడవకు దిగిన ఘటన మంగళవారం శంకరపట్నంలో చోటుచేసుకుంది. తహసీల్దార్ చాంబర్‌లో అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరగగా, కార్యాలయ ఆవరణలో తండ్రి, కూతురు మధ్య వివాదం చోటుచేసుకుంది. చింతలపల్లి గ్రామానికి చెందిన నిమ్మశెట్టి బాబురావు తన ఇద్దరు కుమారుల పేర్లపై వ్యవసాయ భూమిని రిజిస్ట్రేషన్ చేశారు. బాబురావు దంపతుల పేరిట ఉన్న మరో 30 గుంటల భూమిలో కొంత భాగాన్ని పెద్ద కుమారుడు విక్రయించేందుకు ప్రయత్నించగా, చిన్న కుమారుడు అభ్యంతరం వ్యక్తం చేయడంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయింది. ఇల్లు నిర్మాణం కోసం చేసిన అప్పుల నేపథ్యంలో సమస్యను పరిష్కరించుకునేందుకు కుటుంబ సభ్యులంతా తహసీల్ కార్యాలయానికి వచ్చారు. తహసీల్దార్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుండగా కుటుంబ సభ్యుల మధ్య మాటామాటా పెరిగింది. తండ్రి తనను చెప్పుతో కొడతానని అన్నాడంటూ కూతురు ప్రశ్నిస్తూ చెప్పు చూపించడంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కార్యాలయంలో ఉన్న ఇతర రైతులు జోక్యం చేసుకుని వారిని బయటకు పంపించడంతో పరిస్థితి సద్దుమణిగింది. తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తే సీనియర్ సిటిజన్ చట్టం కింద చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని తహసీల్దార్ కుమారులను హెచ్చరించారు. భూ సమస్య పరిష్కారం కోసం వచ్చిన కుటుంబ కలహాలు తహసీల్ కార్యాలయంలోనే రచ్చకు దారితీయడం చర్చనీయాంశంగా మారింది.

## మొక్కల సంరక్షణతో పర్యావరణ పరిరక్షణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పచ్చదనాన్ని పెంచి సమతుల్య వాతావరణాన్ని నిర్మించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి వనంలో డీసీపీ ఎ.భాస్కర్, అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్‌తో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో మంగళవారం 4 లక్షల మొక్కలు నాటినట్లు తెలిపారు. జిల్లాకు నిర్దేశించిన 41 లక్షల మొక్కల లక్ష్యంలో దాదాపు 80 శాతం పూర్తి చేశామని చెప్పారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు.అనంతరం మందమర్రి ఆర్కే గార్డెన్స్‌లో నిర్వహించిన రెండు పడక గదుల ఇండ్ల లక్కీ డ్రాలో పాల్గొన్నారు. అర్హులైన నిరుపేదలకు పారదర్శకంగా

# సీఎంఆర్ బియ్యం సరఫరాలో జాప్యం వద్దు

- **జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు**



**శెనార్తి మీడియా, మంచిర్యాల:** ప్రభుత్వానికి అందించాల్సిన సీఎంఆర్ బియ్యం సరఫరాను వేగవంతం చేసి, నిర్దేశించిన గడువులోగా ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళతో కలిసి రైస్ మిల్లర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ధాన్యం సేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని సూచించారు. మిల్లింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం చేయకుండా ముడి బియ్యాన్ని వెంటనే ప్రభుత్వానికి సరఫరా చేయాలని స్పష్టం చేశారు. రబీ 2024–25 సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్‌ను ఈ నెల 31లోగా తప్పనిసరిగా పూర్తి చేయాలని ఆదేశించారు. మిగిలిన సీఎంఆర్‌ను కూడా వేగంగా పూర్తి చేసి, బియ్యం సరఫరా చేయాలని తెలిపారు. అదేవిధంగా ఖరీఫ్, రబీ 2025–26 సీజన్లకు సంబంధించిన సీఎంఆర్‌ను ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ నుంచి మిల్లింగ్, బియ్యం సరఫరా వరకు అన్ని దశలను సమన్వయంతో నిర్వహించి పెండింగ్ లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వానికి బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం లేదా జాప్యం జరిగితే సహించేది లేదని స్పష్టం చేస్తూ, అధికారులు నిరంతరం ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏసీఎస్ఓ, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎంఎంఎస్ దరఖాస్తు గడువు పొడిగింపు

**శెనార్తి మీడియా, మంచిర్యాల:**

జాతీయ ఆదాయ ఆధారిత ప్రతిభా ఉపకార వేతన పథకం (NMMS) 2026–27 పరీక్షకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాధికారి పి.చంద్రయ్య తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, ఎంపీపీ, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని మోడల్ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 1లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు దరఖాస్తుల హార్డ్‌కాపీలను సెప్టెంబర్ 3లోగా సమర్పించాలని తెలిపారు.జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 దరఖాస్తు రుసుము చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.






## శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**శెనార్తి మీడియా, మంచిర్యాల:** పోటీ పరీక్షల్లో విజయం సాధించేందుకు దృఢ సంకల్పం, క్రమశిక్షణ, నిరంతర కృషి అవసరమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో ఎస్ఐ, పీసీ ఉద్యోగార్థుల కోసం ఏర్పాటు చేసిన 'నిపుణ' ఉచిత శిక్షణ కేంద్రాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉచిత శిక్షణను అభ్యర్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించి, నోట్స్ తయారు చేసుకుంటూ తమ సామర్థ్యాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసుకోవాలని తెలిపారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ పరీక్షకు మిగిలిన ప్రతి రోజును సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో శిక్షణకు హాజరు కావాలని సూచించారు. ప్రతిరోజూ కొత్త విషయాలు నేర్చుకోవడంతో పాటు వాటిని పునరావృతం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీసీపీ ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, ఆర్ఐ సంపత్, శిక్షకులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

# గని కార్మికులతో రక్షాబంధన్ వేడుకలు



**శెనార్తి మీడియా, గోదావరిఖని:**

రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని గోదావరిఖని సింగరేణి 11వ ఇంక్లైన్ గనిలో బీజేపీ రాష్ట్ర నాయకులు సోమారపు లావణ్య అరుణ్ కుమార్ ఆధ్వ ర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులు, అధికారులు, సిబ్బందికి రాఖీలు కట్టి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. సింగరేణి కార్మికులు కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి, దేశ ఆర్థిక ప్రగతికి అందిస్తున్న సేవలు అభినందనీయమని సోమారపు లావణ్య అరుణ్ కుమార్ పేర్కొన్నారు. రక్షాబంధన్ సోదర–సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరి జీవితాల్లో ఈ పర్వదినం ఆనందం, సుఖ సంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. కార్మికులతో ఆత్మీయంగా మమేకమై వేడుకలు నిర్వహించడంపై పలువురు కార్మికులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు, పిట్ సెక్రటరీ వేల్పుల లక్ష్మణ్, ముల్గురి వీరయ్య, పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు వడ్డేపల్లి భారతి, మాజీ జిల్లా ఉపాధ్యక్షురాలు మాతంగి రేణుక, కార్పొరేటర్ అభ్యర్థి అరిగేల శ్రవణ్, రాజు, నాయకులు సురేష్, శంకర్, కుమారస్వామి, హనుమంత్, మంజుల, రజిత, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.



# దాచారంలో వన మహోత్సవం



**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మండలంలోని దాచారం గ్రామంలో సర్పంచ్ బైర మానసరాజేందర్ ఆధ్వర్యంలో ఎల్లమ్మగుడి వద్ద మంగళవారం ఈత మొక్కలు నాటారు. ఎక్సైజ్ సీఐ పవన్, ఎస్సై దామోదర్ గౌడ కులస్తులకు ఈత మొక్కలు అందజేశారు. అనంతరం ఆ మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈత చెట్లు పర్యావరణ పరిరక్షణతో పాటు గౌడ కులస్తుల జీవనోపాధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ బైర మానస రాజేందర్ మాట్లాడుతూ గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు గౌడ కుటుంబాలకు ప్రయోజనం చేకూరేలా ఈత మొక్కలను విస్తృతంగా నాటుతున్నామని తెలిపారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించేలా గ్రామ ప్రజల సహకారం తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దీటి బాలనర్సు, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రక్షాబంధన్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలి

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

ఆర్ఎస్ఎస్ బెజ్జంకి ఖండ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించనున్న రక్షాబంధన్ ఉత్సవాన్ని విజయవంతం చేయాలని మండల కార్యవాహ బెజగం సురేష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ ఉత్సవంలో ప్రముఖ సామాజిక సమరసత వేదిక కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రసంగించనున్నట్లు తెలిపారు. ధర్మం, సమాజం, సంస్కృతి పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బెజ్జంకి మండలంలోని ప్రతి గ్రామం నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ నెల 27న సాయంత్రం 5 గంటలకు బెజ్జంకిలోని నర్మదా గార్డెన్‌లో కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్షాబంధన్ ఉత్స వాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## గొర్రెల పెంపకదారుల సంఘం నూతన కమిటీ



**శెనార్తి మీడియా, మానకొండూర్:** శంషాబాద్ ప్రాథమిక గొర్రెల మేకల పెంపకదారుల సహకార సంఘం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాకారపు రమేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా జక్కుల ఎల్లయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గడ్డి శ్రీకాంత్ యాదవ్, కోశాధికారిగా బాకారపు రాజు యాదవ్, జాయింట్ సెక్రటరీగా బూస కనకమ్మ ఎన్నికయ్యారు. డైరెక్టర్లుగా బైకానీ భాగ్యలక్ష్మి , బూస కుమారస్వామి యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా బాకారపు ఆంజనేయులు యాదవ్, బూస మహేందర్ యాదవ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బాకారపు రమేష్ యాదవ్ మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధికి పాలకవర్గం శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని చెప్పారు.

